



# మన దునియా

Our News Our World

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number TELTEL/2023/85680



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న

మన దునియా

9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 293 | జూన్ 21 ఆదివారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


## తాతల కాలం నాటి

# నేరేడు సామెత రహస్యం!

## కరువుకు ముందస్తు హెచ్చరిక..

నేరేడు కాయలు విరగకపోతే..
**వర్షాలు తగ్గే సంకేతం!**

ప్రకృతి చెబుతున్న ముందస్తు హెచ్చరికలను
**గుర్తించిన తెలుగువారి తాతల జ్ఞానం!**

సామెతల్లో దాగిన శాస్త్రం..
**అనుభవంలో పుట్టిన జ్ఞానం!**

కరువు నుంచి తప్పించుకోవాలంటే..
**ఇప్పటి నుంచే సిద్ధం కావాలి!**




**మన దునియా,హైదరాబాద్:డెస్క్ జాన్ 20**

నేరేడు కాయలు విరగకాస్తే.. ఆ ఏడాది కరువు వస్తుంది".. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ పెద్దలు తరచూ చెప్పుకునే పాత సామెత ఇది. సాధారణంగా మే, జూన్ నెలల్లో నేరేడు పండ్లు మార్కెట్లోకి వస్తుంటాయి. అయితే, ఏదైనా ఒక సంవత్సరం నేరేడు చెట్లు ఆశించిన దానికంటే విపరీతంగా కాపు కాస్తే, ఆ ఏడాది వర్షాలు పడవు, కరువు కాటకాలు తప్పవని మన పూర్వీకులు నమ్మేవారు. ప్రస్తుత తరుణంలో ఒకవైపు తెలుగు రాష్ట్రాల్లో నేరేడు కాపు కనిపిస్తుండటం, మరోవైపు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు 'ఎల్ నినో' పరిస్థితులు పొంచి ఉన్నాయని హెచ్చరిస్తుండటంతో.. ఈ పాత సామెత వెనుక ఉన్న అసలు నిజాలేంటో

(మిగతా 2వ పేజీలో..)

## స్కూళ్లు, అంగన్ వాడీ కేంద్రాలకు విజయ డెయిరీ పాలు: భట్టి

**మన దునియా,హైదరాబాద్:జాన్ 20**

స్కూళ్లు, అంగన్ వాడీ కేంద్రాలకు విజయ డెయిరీ పాలు: భట్టి తెలంగాణ : ప్రభుత్వ పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలకు విజయ డెయిరీ నుంచి పాలను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం సచివాలయంలో పశుసంవర్ధక శాఖ మంత్రి

(మిగతా 2వ పేజీలో..)



## మోదీ ప్రారంభించిన పథకాలు ఎప్పటికీ ఆగవు: బండి సంజయ్

**మన దునియా,హైదరాబాద్:జాన్ 20**



ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఎప్పటికీ ఆగవని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని నిరంతరం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు.

(మిగతా 2వ పేజీలో..)

## నిరాహార దీక్ష చేస్తా: కాంగ్రెస్ ప్రభుత్వానికి కవిత వార్నింగ్

**సింగరేణి బాయిబాట కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి జిల్లాలోని గనిని సందర్శించిన కవిత**

**మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న 1200 మంది వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్**

**ఉద్యోగాలు ఇవ్వకపోతే జులై 20 నుంచి నిరాహార దీక్షకు కూర్చుంటానని హెచ్చరిక**

సింగరేణి 'బాయిబాట' కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు

(మిగతా 2వ పేజీలో..)



## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్ లేఖ

**మన దునియా,హైదరాబాద్:జాన్ 20**

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్ లేఖ తెలంగాణ : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాశారు. మెట్రో రైలు పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ నెల 22, 23వ తేదీల్లో తాను ఢిల్లీలో ఉంటానని, ఈ సమయంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే మంత్రితో భేటీ ఏర్పాటు చేస్తే అవసరమైన పత్రాలు తీసుకొస్తానని లేఖలో పేర్కొన్నారు. ఇక మెట్రో రైలు హైదరాబాద్‌కు, రాష్ట్రానికీ అత్యంత కీలకమైన ప్రాజెక్టని గుర్తు చేశారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# మోదీ ప్రారంభించిన పథకాలు ఎప్పటికీ ఆగవు: బండి సంజయ్

(మొదటి పేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం 12 లక్షల మందికి పైగా ఉద్యోగాలు కల్పించిందని బండి సంజయ్ తెలిపారు. అలాగే రైతుల కోసం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ఒక్కసారి కూడా నిలిచిపోలేదని, అర్హులైన రైతులకు నిరంతరం ఆర్థిక సహాయం అందుతోందన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో కేంద్ర ప్రభుత్వమే కీలక పాత్ర పోషిస్తోందని ఆయన చెప్పారు. వ్యవసాయ రంగానికి అవసరమైన యూరియా, డీఏపీ ఎరువులపై భారీ సబ్సిడీని కేంద్రం భరిస్తోందని పేర్కొన్నారు. ఎరువుల ధరలు రైతులపై భారం కాకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.12 వేల కోట్లకు పైగా సబ్సిడీ అందిస్తోందని బండి సంజయ్ వెల్లడించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

## స్కూళ్లు, అంగన్ వాడీ కేంద్రాలకు విజయ డెయిరీ పాలు: భట్టి

వాకాటి శ్రీహరి, ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న 27 లక్షల మంది విద్యార్థులకు అందిస్తామని, మొత్తం పాల ఉత్పత్తికి సంబంధించి ఖచ్చితమైన లెక్కలు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

## రూ.లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం.. మాపై దుష్ప్రచారం ఆపండి: హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైడ్రాకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారంటూ రంగనాథ్ ఆగ్రహం**

**హైడ్రాను బద్నాం చేసేందుకు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు**

**సిటీలో ఇప్పటి వరకు 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని వెల్లడి**

**తమకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదన్న రంగనాథ్**

**హైడ్రా ఎప్పుడూ మౌనంగా ఉండదని స్పష్టీకరణ**

హైదరాబాద్ లో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న 'హైడ్రా'పై గత కొన్ని రోజులుగా వ్యతిరేక ప్రచారం జరుగుతోందంటూ ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్ తీవ్రంగా స్పందించారు. కొందరు పనిగట్టుకుని తమ సంస్థను బద్నాం చేయడానికి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈరోజు హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన హైడ్రా యాక్షన్ ప్లాన్, ఇప్పటివరకు సాధించిన విజయాలపై పక్కా లెక్కలతో క్లారిటీ ఇచ్చారు హైడ్రా కేవలం కూల్చివేతలకే పరిమితం కాలేదని, ఇప్పటివరకు సిటీలో దాదాపు 600 ఆపరేషన్స్ పూర్తి చేసి, ఆక్రమణదారుల గుప్పిట్లో ఉన్న సుమారు లక్షా పదివేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను, చెరువులను, పార్కులను కాపాడామని రంగనాథ్ వెల్లడించారు. దోపిడీకి గురికాకుండా ఉండాలనే ఆకాంక్షతోనే ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని, ఆ ఆశయాలకు అనుగుణంగానే ప్రభుత్వ ఆస్తులను రక్షిస్తున్నామని చెప్పారు."రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. మాకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. ఎంఐఎం అయినా, అధికార కాంగ్రెస్ అయినా మాకు ఒకటే. ఫాతిమా కాలేజీ లాంటి విద్యాసంస్థలు భాగ్యనగరంలో చాలా ఉన్నాయి. చట్టం అందరికీ సమానమే. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదు. అలాగని రాత్రికి రాత్రి వచ్చి ఇళ్లను కూల్చేస్తుందనేది అవాస్తవం" అని స్పష్టం చేశారు.గుడిసెలు వేసుకున్న వారిలో నిజమైన పేదలు ఎవరు అనేది పరిశీలిస్తామని, వారికి ప్రభుత్వం తరఫున డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని మానవీయ కోణంలో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి నగరం అతలాకుతలం అయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆక్రమణల వల్లే నాలాలు పూడిపోయి ఈ పరిస్థితి వచ్చిందన్నారు. "లక్ష మంది ప్రజలకు మంచి చేయాలన్నప్పుడు.. కొంతమంది ఆక్రమణదారులకు చెడు జరగక తప్పదు. ఒకవేళ హైడ్రా వైపు ఏమైనా తప్పు ఉంటే క్షమాపణ చెప్పడానికి కూడా సిద్ధమే. తప్పులు జరిగితే సరిదిద్దుకుంటూ ముందుకెళతాం. హైడ్రా పొలిటికల్ సెటిల్‌మెంట్లకు అడ్డాగా మాత్రం మారదు" అని తేల్చిచెప్పారు.



# తాతల కాలం నాటి నేరేడు సామెత రహస్యం! కరువుకు ముందస్తు హెచ్చరిక..

(మొదటి పేజీ తరువాయి)

తెలుసుకోవాలని చాలామంది ఆరాటపడుతున్నారు. ఈ నేపథ్యంలో నాటి పెద్దల నమ్మకానికి, నేటి సైన్స్‌కు ఉన్న సంబంధంపై ప్రత్యేక కథనం.

**సామెత వెనుక ఉన్న సైన్స్ ఏంటి?**

పెద్దలు చెప్పిన ఈ మాట కేవలం మూఢనమ్మకం కాదు, దాని వెనుక బలమైన వాతావరణ సంకేతం దాగి ఉందని వృక్షశాస్త్ర నిపుణులు చెబుతున్నారు. నేరేడు చెట్టుకు ఒక ప్రత్యేకత ఉంది. వాతావరణంలో తేమ శాతం చాలా తక్కువగా ఉండి, ఎండలు విపరీతంగా ముదిరినప్పుడు (అంటే తీవ్రమైన పొడి వాతావరణం ఉన్నప్పుడు) నేరేడు చెట్లు తమ మనుగడ కోసం రక్షణ చర్యలు చేపడతాయి. పూత రాలకుండా, ఎక్కువ సంఖ్యలో కాయలు కాసేలా హార్మోన్లను విడుదల చేస్తాయి. అంటే, ఏ ఏడాది అయితే ఎండలు తీవ్రంగా ఉండి, భూగర్భ జలాలు అడుగంటుతాయో.. ఆ ఏడాది నేరేడు కాయలు విరగకాస్తాయి. తీవ్రమైన ఎండలు, వర్షాభావ పరిస్థితులే కరువుకు సంకేతం కాబట్టి, నేరేడు కాపును చూసి ఆ ఏడాది వర్షాలు పడవని పెద్దలు అంచనా వేసేవారు.

**ప్రస్తుతం పొంచి ఉన్న 'ఎల్ నినో' ముప్పు!**

నాటి పెద్దలు నేరేడు కాపును చూసి కరువును ఊహిస్తే.. నేటి శాస్త్రవేత్తలు పసిఫిక్ మహాసముద్రంలో వచ్చే మార్పులను బట్టి కరువును అంచనా వేస్తున్నారు. దానికి వారు పెట్టిన పేరే 'ఎల్ నినో'. పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు సాధారణం కంటే ఎక్కువగా వేడెక్కడాన్ని ఎల్ నినో అంటారు. దీని ప్రభావం వల్ల ప్రపంచవ్యాప్తంగా వాతావరణ సమతుల్యత దెబ్బతింటుంది. ముఖ్యంగా భారతదేశంలో రుతుపవనాల గమనం నెమ్మదించి, వర్షాలు గణనీయంగా తగ్గుతాయి. తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదై కరువు పరిస్థితులు ఏర్పడతాయి.

**మూఢనమ్మకం కాదు.. ప్రకృతి ముందస్తు హెచ్చరిక!**

ప్రస్తుతం అంతర్జాతీయ వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న 'ఎల్ నినో' సృష్టించే పొడి వాతావరణమే.. నేరేడు చెట్లు విపరీతంగా పూత పూయడానికి అనుకూలమైన సమయం. అంటే, ప్రకృతి తనలో రాబోతున్న మార్పులను జీవజాలం ద్వారా మనకు ముందే హెచ్చరిస్తుంది. నాటి కాలంలో శాటిలైట్లు, సూపర్ కంప్యూటర్లు లేవు కాబట్టి, మన పెద్దలు ప్రకృతిలో వచ్చే ఇలాంటి మార్పులను గమనించి "నేరేడు కాస్తే కరువు" అనే సామెతను వాడుకలోకి తెచ్చారు.

**రైతులకు విజ్ఞప్తి: కంది పంటకు ఎల్ నినో గండం!**

కాబట్టి, నేరేడు కాయలు ఎక్కువగా కాయడం వల్ల కరువు రాదు.. రాబోయే కరువు వాతావరణ పరిస్థితుల వల్లే నేరేడు కాయలు ఎక్కువగా కాస్తాయి అనేది ఇక్కడ గమనించాల్సిన అసలు వాస్తవం. ఏది ఏమైనప్పటికీ, సైన్స్ చెబుతున్న ఎల్ నినో హెచ్చరికలను, ప్రకృతి ఇస్తున్న సంకేతాలను దృష్టిలో ఉంచుకుని రైతాంగం, ప్రభుత్వం నీటి నిల్వలను జాగ్రత్తగా వాడుకుంటూ ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావడం ఎంతో అవసరం.

# నిరాహార దీక్ష చేస్తా: కాంగ్రెస్ ప్రభుత్వానికి కవిత వార్నింగ్

(మొదటి పేజీ తరువాయి)

కల్వకుంట్ల కవిత ఈరోజు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కేటీకే-5 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, సింగరేణి యాజమాన్యంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణిలో మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకుని పెండింగ్‌లో ఉన్న దాదాపు 1200 మంది వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఒక నెల రోజులు టైమ్ ఇస్తున్నామని, ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకపోతే జులై 20 నుంచి తాను నిరాహార దీక్షకు కూర్చుంటానని హెచ్చరించారు. సింగరేణిలో ఏ చిన్న పని జరగాలన్నా నేరుగా డిప్యూటీ సీఎం ఆఫీస్ నుంచే లంచాలు అడుగుతున్నారంటూ కవిత సంచలన ఆరోపణ చేశారు. కాంగ్రెస్ పాలనలో లాభాల్లో ఉన్న సింగరేణిని నష్టాల్లోకి నెట్టేస్తున్నారని మండిపడ్డారు. మొన్న జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడికి తీవ్ర గాయాలవడానికి యాజమాన్యం వాడుతున్న నాసిరకం డిటోనేటర్లే కారణమన్నారు. గనుల లోపల పని చేసే కార్మికులకు కనీసం స్వచ్ఛమైన గాలి, మంచి నీరు కూడా ఇవ్వకుండా అధికారులు కక్కుర్తి పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రిటైర్ అయిన కార్మికులకు సొంత ఇంటి కల నెరవేర్చడం కోసం సింగరేణికి ప్రత్యేకంగా 'హౌసింగ్ బోర్డు' ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం లేదా కార్మిక సంఘం తరఫున రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు. అలాగే విజిలెన్స్ ఎంక్వయిరీల పేరుతో కార్మికులను భయభ్రాంతులకు గురిచేయవద్దని అన్నారు. ఉద్యమ కాలం నుంచే తాను సింగరేణి కార్మికులతో కలిసి నడిచానని గుర్తుచేసిన కవిత... తెలంగాణ హక్కుల కోసం తాను స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన' పార్టీని భూపాలపల్లి ప్రజలు, బొగ్గుగని కార్మికులు గుండెల్లో పెట్టుకుని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

# పోక్సో కేసు.. బండి సంజయ్ కొడుకు భగీరథ్‌కు బెయిల్

**పోక్సో కేసులో నెల రోజులుగా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న భగీరథ్**

**షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన మల్కాజ్‌గిరి కోర్టు**

**రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారిన భగీరథ్ వ్యవహారం**



తెలంగాణలో గత నెల రోజులుగా హాట్ టాపిక్‌గా ఉన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. భగీరథ్‌కు ఎట్టకేలకు మల్కాజ్‌గిరి కోర్టులో ఊరట లభించింది. దాదాపు నెల రోజులుగా చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న అతనికి న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.ఒక మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో భగీరథ్‌పై కఠినమైన పోక్సో కేసు నమోదైన సంగతి తెలిసిందే. కేంద్ర మంత్రి కొడుకు కావడం, పైగా సున్నితమైన కేసు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ అంశం పెద్ద చర్చనీయాంశంగా మారింది. కొన్ని రోజులు అజ్ఞాతంలోకి వెళ్లిన భగీరథ్.. మే 17న పోలీసుల ముందుకు వచ్చి సరెండర్ అయ్యాడు.ఆ తర్వాత మేడ్చల్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో చర్లపల్లి జైలుకు తరలించారు. బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురవడంతో నెల రోజులకు పైగా జైల్లోనే గడపాల్సి వచ్చింది. తాజాగా ఇంజినీరింగ్ పరీక్షల నేపథ్యంలో, భగీరథ్ కు కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో, భగీరథ్ జైలు నుంచి బయటకు రానున్నారు.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం
RNI Number



# ఏటూరునాగారంలో నూతనంగా చేతిపంపులు డ్రైనేజీ కలవర్టును ప్రారంభించిన సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు





**మన దునియా, వాజేడు, జూన్ 20**

ఏటూరు నాగారంలో మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 5వ వార్డు మరియు 8వ వార్డులో ప్రజల తాగునీటి సమస్యల పరిష్కారం కోసం నూతనంగా ఏర్పాటు చేసిన చేతిపంపులను మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు అనంతరం నాలుగో వార్డులో ప్రజల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన డ్రైనేజీ కల్వర్టును కూడా ఆమె ప్రారంభించ్చారు ఈ సందర్భంగా సర్పంచ్ గారు మాట్లాడుతూ గ్రామస్తులు కు తాగునీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు మౌలిక వసతులు కల్పనలో భాగంగా ఈ చేతిపంపులను మరియు డ్రైనేజీ కలవట్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు రాబోయే రోజుల్లో కూడా గ్రామంలో అన్ని వార్డుల అభివృద్ధికి సమస్యల పరిష్కారా నికి కృషి చేస్తాన ని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ సంబంధించిన వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ మరియు గ్రామ పెద్దలతో పాటు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# నిబంధనలు పాటించని వాహనాలు సీజ్ ఎస్సై తాజుద్దీన్





**మన దునియా,గోవిందరావుపేట.(పసర),జూన్ 20**



నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని.ట్రాక్టర్. కార్. ఆటో . ద్విచక్ర వాహనాల యజమానులు, డ్రైవర్లు తప్పనిసరిగా రవాణా నిబంధనలు పాటించాలని పసర పోలీస్ స్టేషన్ ఎస్సై తాజుద్దీన్ సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే ట్రాక్టర్. కార్. ఆటో. ద్విచక్ర వాహనాల యజమానులకు 20 సార్లు అవకాశం కల్పించడంతో పాటు కౌన్సిలింగ్ కూడా నిర్వహించినప్పటికీ కొందరిలో మార్పు కనిపించడం లేదని ఆయన తెలిపారు. వాహనాల డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, పొల్యూషన్ సర్టిఫికేట్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు.అలాగే వాహనం వెనుక



భాగంలో రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రేపటి నుంచి సరైన పత్రాలు లేని ట్రాక్టర్లు, వెనుక రేడియం స్టిక్కర్లు లేని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వాటిని సీజ్ చేస్తామని ఎస్సై తాజుద్దీన్ హెచ్చరించారు.ప్రజల భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ రవాణా నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

# ఘనంగా కామ్రేడ్ వై. తారక్ నాథ్ వర్ధంతి

### ఎస్బీఐ ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరం

**మన దునియా, జూన్ 20,మంచిర్యాల జిల్లా**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ( ఎస్బిఐ) రెడ్డి కాలనీ బ్రాంచ్ ఆధ్వర్యంలో శనివారం 'యూనియన్ డే' ( ఎస్బిఐ ఎస్ యు హెచ్ సి ) సందర్భంగా భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎస్బీఐ మాజీ ఉద్యోగి, దివంగత కామ్రేడ్ వై. తారక్ నాథ్ 22వ వర్ధంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.కామ్రేడ్ కె. శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో ఎస్బీఐ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.ముఖ్య అతిథుల హాజరుఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్బీఐ రీజినల్ మేనేజర్ రితేష్ కుమార్ గుప్తా, చీఫ్ మేనేజర్ అలోక్ వర్మ, హెచ్ఆర్ రామకృష్ణ హాజరయ్యారు. వారితో పాటు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రెటరీ చందూరి మహేందర్, స్టేట్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు వి. మధుసూదన్ రెడ్డి పాల్గొని రక్తదాతలను అభినందించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ప్రాణాపాయంలో ఉన్న ఎంతోమందికి రక్తదానం జీవనదాతగా మారుతుందని, సామాజిక బాధ్యతగా ఎస్బీఐ సిబ్బంది ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుండడం అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎస్బీఐ బ్యాంకు సిబ్బంది, ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, స్థానిక యూనియన్ నాయకులు పాల్గొన్నారు.




# ఆర్పీఐ జిల్లా నూతన అధ్యక్షుడిగా దూడం తిరుపతి ఎన్నిక

**మన దునియా, జూన్ 20,మంచిర్యాల జిల్లా**



మందమర్రి మార్కెట్ లోని ఆర్పీఐ అత వాలే పార్టీ కార్యాలయంలో శనివారం రోజు సీనియర్ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగపిండి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం సీనియర్ నాయకులు తుంగపిండి రమేష్ నూ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా పాత కమిటీని రద్దు చేస్తు మంచిర్యాల జిల్లా నూతన అధ్యక్షుడిగా దూడం తిరుపతిని నియమించారు.పార్టీ బలోపేతం కొరకు ప్రతి ఒక్క కార్యకర్త తమ శక్తివంతమైన మేరకు పనిచేసి పార్టీని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అంతేకాకుండా ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజాల పక్షాన నిలబడి పోరాటం చేయాలని ప్రతి కార్యకర్తను ఉద్దేశించి మాట్లాడారు అనంతరం మంచిర్యాల జిల్లా నూతన అధ్యక్షునిగా దూడెం తిరుపతికి నియామక పత్రాన్ని అందజేశారు. నాపై నమ్మకంతో నాకు ఇచ్చిన జిల్లా అధ్యక్ష పదవిని దుర్వినియోగం చేయకుండా పార్టీ కోసం కష్టపడతానని ఈ సందర్భంగా తిరుపతి అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు చంద్రగిరి చక్రపాణి అట్వాల్ ,అనిల్ కుమార్ ,ఎండి యాకూబ్, కన్నూరి కృష్ణ, పులిపాక శ్రీనివాస్, చింతలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీ చితాభస్మంలో బయటపడ్డ కత్తెర

### వైద్యుల నిర్లక్ష్యానికి తల్లి, బిడ్డ మృతిచెందిన ఘటనలో వెలుగులోకి కీలక అంశాలు

**మన దునియా,భద్రాద్రి,శంభూనిగూడెం:జాన్20**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం శంభూనిగూడెం గ్రామంలో వనజ(20) అనే గర్భిణీకి పురిటి నొప్పులు రావడంతో గుండాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సాధారణ కాన్పు చేసిన నర్సునర్సు అవగాహన రాహిత్యం వల్ల శిశువు అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్ర రక్తస్రావంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన తల్లిఅయితే తల్లీబిడ్డలకు కర్మకాండ నిర్వహించాక, తల్లి చితాభస్మం సేకరిస్తుండగా అందులో శస్త్ర చికిత్సకు వాడే కత్తెర బయటపడడంతో బోరున విలపించిన కుటుంబ సభ్యులు వైద్యుల నిర్లక్ష్యం వల్లే తల్లి, బిడ్డ ప్రాణాలు కోల్పోయారనేందుకు ఇదే నిదర్శనం అంటూ కుటుంబ సభ్యుల ఆగ్రహంమరోవైపు ఆసుపత్రిలో సాధారణ ప్రసవమే జరిగిందని, కత్తెర ఎలా వచ్చిందో తమకు తెలియదని చెప్తున్న వైద్యాధికారులు

# రోడ్డు ప్రమాదంలో యువ కార్మికుడు మృతి .

**మన దునియా, జూన్ 20,మంచిర్యాల జిల్లా**



పట్టణంలో మూడవ జూన్ కు చెందిన కుంభం రాజు 29 గోదావరిఖనిలో రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తన స్నేహితులను కలిసి ఎందుకు వెళుతు న్నాను అని తల్లిదండ్రులకు చెప్పి ద్విచక్ర వాహనంపై గోదారికానికి వెళ్ళాడు. తిరిగి వస్తున్న క్రమంలో మేకల వ్యాను ఢీకొనడం తో తీవ్ర గాయాల పాలు అయ్యారు. రోడ్డుపై పడి ఉన్న రాజును పోలీసులు గమనించి మందమర్రి లోని కుటుంబ సభ్యులకు ఫోను ద్వారా సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు కరీంనగర్ లోని ప్రైవేట్ ఆస్పత్రి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడు మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిలో జనరల్ అసిస్టెంట్ గా పని చేస్తున్నారు. దీనితో కాస్పేట గనిలో తోటి ఉద్యోగులు రాజ మృతి పట్ల సంతాపం తెలిపారు. ఆయన ఉన్నటువంటి మూడవ జోనులో విషాదం అలముకుంది . కొడుకు కోసం తల్లిదండ్రులు వినిపిస్తున్న దృశ్యం అందర్నీ కంటతడి పెట్టించింది. ఈ మేరకు గోదావరిఖని పోలీసులు కేసు నమోదు చేసుకోరు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైనటువంటి మేకల వ్యాను డ్రైవర్ను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

# అంతర్జాతీయ యోగా దినోత్సవం విద్యార్థులకు శిక్షణ

**మన దునియా: ప్రతినిధి:**



నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం రామడుగు గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల యోగ దినోత్సవం సందర్భంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు యోగా శిక్షణ నిర్వహించారు.. ముఖ్యఅతిథి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి.




కుమార్ యోగ మాస్టర్ జలంధర్ గౌడ్, ప్రధానోపాధ్యాయుల బృందం విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# విజిబుల్ పోలీసింగ్‌తోనే నేరాల నియంత్రణ సాధ్యం

**మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్**

**మన దునియా, జూన్ 20,మంచిర్యాల జిల్లా**



నేరాల నియంత్రణకు నిరంతర పెట్రోలింగ్ చేపట్టాలని మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ అన్నారు. శనివారం మందమర్రి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన డీసీపీ, స్టేషన్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలని సూచించారు. స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్ రికార్డులను తనిఖీ చేశారు. నమోదవుతున్న కేసుల వివరాలు, రౌడీషీటర్ల వివరాలు, నేరాల స్వభావం, కేసుల పురోగతి తదితర అంశాలను తెలుసుకున్నారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ అత్యవసరమని, నిరంతర పెట్రోలింగ్‌తో పాటు ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. గంజాయి,ఇతర మత్తు పదార్థాల క్రయవిక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధికి సంబంధించిన వివిధ అంశాలను సీఐ రమేష్ డీసీపీకి వివరించారు. ఈ తనిఖీలలో బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, మందమర్రి సీఐ రమేష్,ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.

# మళ్లీ కేసీఆర్‌ను సీఎం చేసే వరకు విశ్రమించొద్దు - జగదీష్ రెడ్డి పిలుపు

**కాంగ్రెస్ దుర్మార్గపు ప్రభుత్వం - వడ్లు కొనమని క్యాబినెట్‌లోనే తీర్మానం**

**మన దునియా,సూర్యాపేట జూన్ 20**



ఈ రాష్ట్రంలో అత్యంత దుర్మార్గమైన ప్రభుత్వం ఉందని, క్యాబినెట్ మీటింగ్ పెట్టి మరీ వడ్లు కొనమని చెప్పిన ప్రభుత్వం కాంగ్రెస్ అని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ధ్వజమెత్తారు. సూర్యాపేటలో నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'సర్' ప్రక్రియ చాలా ముఖ్యమైనదని, చాలా ఓట్లు గల్లంతు అయ్యే ప్రమాదం పొంచి ఉందని, అందుకే కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని జగదీష్ రెడ్డి సూచించారు. మళ్లీ కేసీఆర్ గారిని ముఖ్యమంత్రిని చేసే వరకు కార్యకర్తలు విశ్రమించొద్దని పిలుపునిచ్చారు. సూర్యాపేటకు కాంగ్రెస్ నాయకులు మూసి మురికి నీరు అందించారని, మిషన్ భగీరథ పథకంతో తాము స్వచ్ఛమైన నీళ్లు అందించామని గుర్తుచేశారు. రైతును రాజును చేసింది కేసీఆర్ గారేనని, చినుకు పడగానే నాగలి భుజాన వేసుకొని ధీమాగా ఎవుసం చేసేలా చేశారని కొనియాడారు. ఆనాడు వడ్లు కొనమని కేంద్రం చెప్తే ఢిల్లీకి పోయి ధర్నా చేసిన నాయకుడు కేసీఆర్ అని, కేంద్రం కొనకపోతే తామే ధాన్యం మొత్తాన్ని కొన్నామని తెలిపారు. సన్నాలకు బోనస్ అని చెప్పి మోసం చేశారని, కేంద్రాన్ని సాకుగా చూపి ఇక్కడ ధాన్యం కొనమని రేవంత్ రెడ్డి చెబుతున్నారని మండిపడ్డారు. నిలువెల్లా విషం నింపుకున్న చంద్రబాబు నాయుడు, మోడీల కలయికలో వచ్చిన హైబ్రిడ్ ముఖ్యమంత్రి ఈ రేవంత్ రెడ్డి అని జగదీష్ రెడ్డి వ్యాఖ్యానించారు. వీళ్ల పీచం అణిచి, ఆట కట్టించే ఏకైక నాయకుడు కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వచ్చాక గ్రామాల్లో అలజడులు, కొట్లాటలు, గొడవలు మొదలయ్యాయని ఆరోపించారు. యూరియా ఇవ్వలేని చేతకాని సన్నాసి ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. మోసపోయామని రాష్ట్రంలో ప్రతి ఒక్క వర్గం బాధపడుతోందని, అందరినీ ఏమార్చి మోసం చేసి మాయ చేశాడు ఈ రేవంత్ రెడ్డి అని విమర్శించారు. ఆనాడు కడుపు కట్టుకొని అభివృద్ధి చేసి చూపామని, పారదర్శకంగా పాలన చేశామని జగదీష్ రెడ్డి అన్నారు. పాలన అంటే ఇలా ఉండాలని చేసి శభాష్ అనిపించారు కేసీఆర్ గారని, ప్రభుత్వ ఆస్తులు పెంచామని తెలిపారు. ఇవాళ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రి దోచుకొని దాచుకుంటున్నారని, రాష్ట్ర సంపద అంతా దోచుకుంటున్నారని ఆరోపించారు.

# ఏపీలో వచ్చే మూడేళ్లలో 5000 ఆలయాల నిర్మాణం దేవాదాయ శాఖ మంత్రి ఆనం

**మన దునియా,ఆంధ్రప్రదేశ్:జాన్ 20**



ఏపీలో ఏదైనా గ్రామాల్లో నూతనంగా ఆలయాల నిర్మాణాలు చేపట్టే వారికి కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఇందులో భాగంగా పది సెంట్లలోపు స్థలం ఉంటే రూ.20 లక్షలు, 15 సెంట్లు అయితే రూ.30 లక్షలు, 20 సెంట్లు ఉంటే రూ.40 లక్షలు ఆలయ నిర్మాణానికి మంజూరు చేస్తామని, అలాగే ఆ ఆలయం రామాలయమా.. శివాలయామా.. అమ్మవారి దేవాలయమా.. అనేది స్థానికుల నిర్ణయం మేరకు ఉంటుందని, ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ పరిధిలో ప్రతిపాదనలు పంపించాలని జిల్లా కలెక్టర్లు చొరవ తీసుకొని ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలు ఎక్కడెక్కడ అందుబాటులో ఉన్నాయో గుర్తించాలని మంత్రి ఆనం రామ్ నారాయణ రెడ్డి తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రంలో ఐదు వేల ఆలయాల నిర్మాణాలు వచ్చే మూడేళ్లలో చేపడతామని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.

# స్వచ్ఛ కమలాపూర్ అందరి లక్ష్యం గా తీసుకోవాలి





**ఊరి కోసం ఒక రోజు శ్రమదానంలో పాల్గొన్న కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి**

**మన దునియా ప్రతినిధి కమలాపూర్**

హన్మకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో,స్వచ్ఛ కమలాపూర్ లక్ష్యంగా సర్పంచ్ పబ్బు సతీష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ఊరి కోసం ఒక రోజు" శ్రమదాన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి తన పోలీసు సిబ్బందితో కలిసి పాల్గొని గ్రామ వీధుల్లో చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఏసీపీ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత కేవలం గ్రామపంచాయతీ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు బాధ్యతగా భావించి స్వచ్ఛత కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ సతీష్ చేపట్టిన ఈ కార్యక్రమం ఆదర్శనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో సీఐ నవీన్, ఎస్ఐ దిలీప్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఆర్యవైశ్య



సంఘం సభ్యులు, పనుగట్ల స్టార్ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వడదెబ్బతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ఆర్థిక సహాయం





**ఖానాపూర్ ఆర్సి మన దునియా, జూన్;20.**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కామన్ పల్లి గ్రామంలో వడదెబ్బతో మృతి చెందిన జునుగురు భీమలింగు కుటుంబానికి నేతకాని సంఘం,పోచమ్మ వాడ సభ్యులు అండగా నిలిచారు. భీమలింగు అకాల మరణం చెందిన విషయం తెలుసుకున్న నేతకాని సంఘం నాయకులు,సభ్యులు వారి కుటుంబాన్ని పరామర్శించి తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా నేతకాని సంఘం తరపున 5,000 రూపాయలు,అలాగే పోచమ్మ వాడ సభ్యుల తరపున మరో 5,000 రూపాయలు (మొత్తం 10,000 రూపాయల) ఆర్థిక సహాయాన్ని శనివారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు."ఆపదలో ఉన్న ఒక పేద కుటుంబానికి అండగా నిలవడం మనందరి బాధ్యత. భీమలింగు మరణం ఆ కుటుంబానికి తీరని లోటు," అని సంఘం ప్రతినిధులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ముఖ్య నాయకులు,కామన్ పల్లి గ్రామ పెద్దలు మరియు పోచమ్మ వాడ యువకులు పాల్గొన్నారు. అనుకోని విపత్తుతో రోడ్డున పడ్డ కుటుంబానికి ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్న నేతకాని సంఘం,పోచమ్మ వాడ సభ్యులను గ్రామస్థులు అభినందించారు.

# స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకోవడమే ఎస్సై గోపికృష్ణ చేసిన నేరమా?

**కుమారుడు సుధాకర్ పై ఆయన తల్లిదండ్రుల సంచలన ఆరోపణ**

**మన దునియా,పెన్‌పహాడ్:జాన్ 20**

పెన్‌పహాడ్ ఎస్సై గోపికృష్ణపై తమ కుమారుడు సుధాకర్ చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని ఆయన తల్లిదండ్రులు, భార్య శ్రీదేవి స్పష్టం చేశారు. ఒక కుమారుడిగా తమను ఏ రోజూ పట్టించుకోలేదని, భార్యను వదిలేసి మరో యువతితో అక్రమ సంబంధం కొనసాగిస్తూ కుటుంబ బాధ్యతలకు దూరంగా ఉంటున్నాడని వారు ఆరోపించారు. భార్య శ్రీదేవిని వదిలించుకోవడానికే ఎస్సై గోపికృష్ణపై నిరాధార ఆరోపణలు చేస్తున్నాడని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబ సమస్యలను పరిష్కరించేందుకు, కష్టాల్లో ఉన్న స్నేహితుడి కుటుంబానికి మానవతా దృక్పథంతో అండగా నిలిచిన గోపికృష్ణపై ఆరోపణలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. "కన్నీళ్లు తుడిచిన చేతులను నిందించడం ఎంతవరకు సమంజసం? కష్టకాలంలో అండగా నిలిచిన వ్యక్తిని అపవాదులతో వేధించడం న్యాయమేనా?" అని వారు ప్రశ్నించారు. స్నేహితుడి కుటుంబం వీధిన పడకుండా, పిల్లల భవిష్యత్తు దెబ్బతినకుండా మానవీయ కోణంలో సహాయం చేసిన వ్యక్తిపై తప్పుడు ఆరోపణలు చేయడం సమాజానికి మంచి సంకేతం కాదని అన్నారు. కుటుంబాన్ని వదిలిపెట్టి తన స్వార్థ ప్రయోజనాల కోసం ఇతరుల గౌరవాన్ని దెబ్బతీయాలని చూడటం బాధాకరమని పేర్కొన్నారు. ఎస్సై గోపికృష్ణపై చేసిన ఆరోపణలను ప్రజలు నమ్మవద్దని, నిజాలు వెలుగులోకి వస్తాయని తల్లిదండ్రులు, భార్య శ్రీదేవి విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే కుటుంబాన్ని మోసం చేసి, నిరాధార ఆరోపణలతో ఇతరుల ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్న సుధాకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. మానవత్వంతో ఒక కుటుంబానికి అండగా నిలవడం నేరం కాదు... కానీ ఆ మానవత్వాన్ని అపార్థం చేసుకుని అపవాదులు మోపడం మాత్రం సమాజం ఆలోచించాల్సిన విషయం.



మన దునియా



# చుక్కల భూములకు సంబంధించి కీలక ప్రకటన

**10-15 రోజుల్లో చుక్కల భూములకు విముక్తి**

**మన దునియా,ఆంధ్రప్రదేశ్:జూన్ 20**



ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభవార్త.. చుక్కల భూములకు సంబంధించి కీలక ప్రకటన వచ్చింది. త్వరలో 1.90 లక్షల ఎకరాల చుక్కల భూమికి విముక్తి కల్పిస్తామన్నారు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్. 10-15 రోజుల్లో చుక్కల భూములకు విముక్తి లభిస్తుంది అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్పష్టమైన యాజమాన్య హక్కులు లేకుండా రెవెన్యూ రికార్డుల్లో యజమాని కాలమ్‌లో చుక్కలు పెట్టి భూముల్ని వదిలేశారు.. ఈ భూముల్ని చుక్కల భూములుగా పిలుస్తారు. ఈ భూమి ప్రభుత్వానిదా, ప్రైవేట్ వ్యక్తులదా అనేది స్పష్టత లేకపోవడంతో వివాదాలు ఉన్నచోట అధికారులు చుక్కలు పెట్టారు. ఈ భూములపై ఎవరికి హక్కులు ఉన్నాయో క్లారిటీ లేకపోవడంతోనిషేధిత జాబితాలో చేర్చింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెవెన్యూ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చామన్నారు మంత్రి అనగాని సత్యప్రసాద్. ప్రజల ఆస్తులకు భద్రత కల్పించడమే లక్ష్యంగా కీలక నిర్ణయాలు తీసుకున్నాని తెలిపారు. గత రెండేళ్లలో రెవెన్యూశాఖలో కొత్తగా తీసుకొచ్చిన సంస్కరణలు, లక్ష్యాలను వివరించారు. భూములు, రిజిస్ట్రేషన్లు, రీసర్వేకు సంబంధించి ఇబ్బందులు తొలగిపోయాయి అన్నారు. రీసర్వే 2.0ను నిర్వహించి భూ యజమానులు పాస్ పుస్తకాలకు జారీ చేశామన్నారు. అలాగే 1.33 లక్షల ఎకరాల గ్రామ సర్వీస్ ఇనాం భూములకు విముక్తి కల్పించామన్నారు. ఇతర భూ సమస్యల్ని కూడా పరిష్కరించామన్నారు. త్వరలో ఫ్రీహోల్డ్ సమస్యను పరిష్కరిస్తామని.. 22ఏపై గతంలో ఇచ్చిన మెమో కన్నా ఇంకా బెటర్ మెమో ఇస్తామన్నారు.అధికారులు ఓ గ్రామానికి నెలలో నాలుగు రోజులు వెళ్లి అక్కడ ప్రజల సమస్యలు పరిష్కించేలా కార్యక్రమం చేపట్టామన్నారు మంత్రి అనగాని. గత ప్రభుత్వ హయాంలో రీసర్వే చేయించగా.. ఈ భూములకు సంబంధించి ఏకంగా రాష్ట్రవ్యాప్తంగా 7.5 లక్షల ఫిర్యాదులు వచ్చాయన్నారు. అందుకే రీసర్వే చేసిన తర్వాత భూహక్కుదారుల ఈకేవైసీ తీసుకుని పట్టాదారు పాసు పుస్తకాలను అందిస్తున్నాము అన్నారు. ఈ పాస్‌బుక్‌లపై రాజముద్ర, హక్కుదారు ఫోటో, ఖాతా నంబర్, క్యూఆర్ కోడ్ ప్రింట్ చేసి ఇస్తున్నామన్నారు. అన్‌సెటిల్డ్ ఎస్టేట్, ఇనామ్ భూముల సమస్యల్ని పరిష్కరించామన్నారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి స్లాట్ బుకింగ్ విధానం అమలు చేస్తున్నామని.. కేవలం 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తున్నామన్నారు.ఒకవేళ తప్పుడు రిజిస్ట్రేషన్లు చేస్తే వాటిని రద్దు చేసే అధికారం కలెక్టర్లకు ఇచ్చామన్నారు మంత్రి సత్యప్రసాద్. గతంలో జరిగిన తప్పుడు రిజిస్ట్రేషన్లను కూడా రద్దు చేసే అధికారం కూడా ఇస్తామన్నారు. ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి స్పెషల్ సాఫ్ట్‌వేర్ తీసుకొచ్చి పరిశీలిస్తున్నాము అన్నారు. అలాగే రాష్ట్రంలో భూమల మార్కెట్ ధర పెంచే ప్రతిపాదన లేదన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల్ని ప్రోత్సహించే ఉద్దేశంతోనే ఎకరా 99 పైసలకే భూములు ఇచ్చామన్నారు. అందుకే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయన్నారు మంత్రి అనగాని సత్యప్రసాద్.

# షాద్‌నగర్‌లో మట్టి మాఫియా ఆగడాలు..!

**వందల లారీలతో హైదరాబాద్‌కు విలువైన మట్టి తరలింపు**

**చెరువులు, పంటకాలువలు కబ్జాలకు గురవుతున్నాయి**

**పోలీసు--రెవెన్యూ శాఖల మౌనం వెనుక మర్మమేంటి..?**

**షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆగ్రహం**

**మన దునియా,షాద్‌నగర్:జూన్ 20**

షాద్‌నగర్ నియోజకవర్గంలో మట్టి మాఫియా రెచ్చిపోతోందని, రైతులకు ఉపయోగపడాల్సిన విలువైన మట్టి వందల లారీల ద్వారా హైదరాబాద్‌కు తరలిపోతోందని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ మట్టి తరలింపుపై పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. షాద్‌నగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వ్యవసాయానికి ప్రధాన ఆధారాలైన చెరువులు, పంటకాలువలు, వాగులు క్రమంగా కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల స్వార్థ ప్రయోజనాల కోసం సహజ నీటి వనరులను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా బొబ్బిలి చెరువులో రైతులకు ఉపయోగపడే సారవంతమైన ఒండ్రు మట్టిని భారీ ఎత్తున తవ్వి వందలాది లారీల ద్వారా హైదరాబాద్‌కు తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారం అందరికీ కనిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అక్రమ మట్టి రవాణా బహిరంగంగా జరుగుతున్నా పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోందని అన్నారు. పెద్ద ఎత్తున జరుగుతున్న ఈ మట్టి దందాపై ఎందుకు కేసులు నమోదు చేయడం లేదని నిలదీశారు. కేశంపేట మండలంలోనూ అధికారులు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిని వదిలిపెట్టి, తమ సొంత పొలాల్లో వ్యవసాయ అవసరాల కోసం మట్టి పోసుకుంటున్న రైతులను మాత్రమే వేధించడం దురదృష్టకరమని విమర్శించారు. నియోజక వర్గంలోని ఎర్రమట్టి, నల్లమట్టి, విలువైన మొరం వంటి సహజ వనరులు పెద్ద ఎత్తున రాజధాని ప్రాంతానికి తరలిపోతున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. వెంటనే అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, ఈట గణేష్, ఎమ్మెస్ నటరాజన్, లక్ష్మణ్ నాయక్ దేవేందర్ యాదవ్ పెనుముని గోపాల్ చీపిరి రవి యాదవ్ జట్టా కుమార్, యుగంధర్, అశోక్ విశ్వ రామకృష్ణ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు..




# రాయ దుర్గంలో ఘోరం... యువతి కుటుంబంపై కత్తితో దాడి.. నిందితుడు అరెస్ట్..

**మన దునియా,రాయ దుర్గం:జూన్ 20**

ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేయడమే కాకుండా.. నిరాకరించిందనే కక్షతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురిపై కత్తితో ప్రాణాంతక దాడికి తెగబడిన ఘోర సంఘటన రాయ్ దుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయ్‌దుర్గంలోని ఎండ్ల బస్తీ, ఊర పోచమ్మ దేవాలయం సమీపంలో నివసించే ఎండ్ల కృతిక (20) అనే విద్యార్థినిని అదే ప్రాంతానికి చెందిన కాంచమీది గోవర్ధన్ (22) కొంతకాలంగా వన్-సైడ్ లవ్ పేరుతో వేధిస్తున్నాడు. ఆమె అతని ప్రవర్తన నచ్చక దూరం పెట్టడంతో కక్ష పెంచుకున్నాడు.

**తెల్లవారుజామున దొంగతనంగా ఇంట్లోకి చొరబడి..**

శుక్రవారం తెల్లవారుజామున 03:50 నుండి 04:00 గంటల మధ్య సమయంలో బాధితురాలి కుటుంబ సభ్యులంతా నిద్రిస్తున్న వేళ గోవర్ధన్ పక్కనే ఉన్న భవనం పైనుంచి కృతిక ఇంటి రెండో అంతస్తులోకి అక్రమంగా చొరబడ్డాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో కృతిక అక్క పూజిత గొంతుపై పెట్టి, ఎవరైనా అరిస్తే చంపేస్తానని బెదిరించాడు.

**అడ్డువచ్చిన తల్లిదండ్రులు, బాబాయ్‌పై దాడి**

కుటుంబ సభ్యులు నిద్రలేచి నిందితుడిని అడ్డుకునే ప్రయత్నం చేయగా, గోవర్ధన్ ఉన్మాదిలా ప్రవర్తించాడు. కృతిక, ఆమె తల్లిదండ్రులను చంపాలనే ఉద్దేశంతో కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. వారి అరుపులు విని పక్కనే ఉన్న బాబాయ్ అర్జున్ కాపాడటానికి రాగా, అతనిపై కూడా కత్తితో దాడికి తెగబడ్డాడు.ఇంట్లో జరుగుతున్న గొడవ, ఆర్తనాదాలు విన్న స్థానికులు వెంటనే అప్రమత్తమై ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడు గోవర్ధన్‌ను సాహసంతో పట్టుకుని, బంధించి పోలీసులకు అప్పగించారు.

**గాయపడిన ఐదుగురు.. ప్రస్తుతం సురక్షితం**

ఈ దాడిలో కృతిక ఎడమ చేతికి తీవ్ర రక్తగాయమైంది. ఆమె అక్క పూజిత వేళ్లకు, తండ్రి ఉంగరపు వేలికి గాయాలయ్యాయి. తల్లి కుడిచేతికి, ముఖంపై తీవ్ర గాయాలు కావడంతో పాటు దాడిలో ఆమె పన్ను కూడా ఊడిపోయింది. కాపాడటానికి వచ్చిన బాబాయ్ అర్జున్ కూడా రక్తగాయాలపాలయ్యాడు. ప్రస్తుతం బాధితులంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వారందరూ ప్రమాదం నుండి బయటపడ్డారని పోలీసులు తెలిపారు.బాధితురాలు కృతిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాయ్ దుర్గం పోలీసులు నిందితుడు గోవర్ధన్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి, అతడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

# ములుగు జిల్లా కోర్టు జిపి నియామకంలో దళితులకు మళ్లీ అన్యాయమేనా...?




**మన దునియా ,వాజేడు , జూన్ 20**

ములుగు జిల్లా కోర్టు గవర్నమెంట్ ప్లీడర్( జిపి )నియామకం మరోసారి చర్చనియ అంశంగా మారింది గతంలో దళిత న్యాయవాదికి అవకాశం కల్పిస్తామని అనువాద వర్గాల్లో ప్రచారం జరిగినప్పటికీ ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు భిన్న సంకేతలను అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి జిల్లాలో సుదీర్ఘ అనుభవం అరవత కలిగిన దళిత న్యాయవాదులు ఉన్నప్పటికీ వారికి తగిన ప్రాధాన్యత లభిస్తుందా లేదా అన్నది సందేహాలు నెలకొన్నారు సామాజిక న్యాయం సమాన అవకాశాల గురించి ప్రభుత్వాలు పదేపదే మాట్లాడుతూన్న నేపథ్యంలో జిపి వంటి కీలక పదవుల్లో అణగారిన వర్గాలకు అవకాశం కల్పించాలని అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు ఇప్పటికే దళిత న్యాయవాదికి అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతున్న ప్రస్తుతం ఇతర సామాజిక రాజకీయ సమీకరణాలు తెరపైకి రావడం పలు ప్రశ్నలకు తావిస్తుంది హామీలు అమలు అవుతాయా లేక చివరి నిమిషంలో నిర్ణయాలు మారుతాయి అనే చర్చ న్యాయవాద వర్గాలో జోరుగా సాగుతుందిములుగు జిల్లా ఏర్పడినప్పటి నుంచి సామాజిక న్యాయానికి పెద్దపీట వేయాలని ఈ నేపథ్యంలో జిల్లాకు జిపి నియామకం లో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకు ఒటుంది ఆసక్తిగా మారింది దళిత న్యాయవాదికి అవకాశం కలిపించి ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటుందా లేక మరోసారి నిరాశకు గురిచేస్తుందా అనే ప్రశ్నలు ప్రస్తుతం జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి

# వరంగల్ జిల్లాలో ఘనంగా తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ

**మన దునియా,వరంగల్,జిల్లా:జూన్ 20**




తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో జెండా పండుగను వరంగల్‌లో ఘనంగా నిర్వహించారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొని పార్టీ జెండాను ఎగురవేశారు.అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన జెండా గద్దెను ఆవిష్కరించి పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని జెండా పండుగను విజయవంతం చేశారు. పార్టీ అధ్యక్షురాలు కవితకు ఘన స్వాగతం పలికి తమ సంఘీభావాన్ని తెలియజేశారు.

## నేడు తెలంగాణలో భారీ వర్షాలు

**మన దునియా,హైదరాబాద్:జూన్ 20**

తెలంగాణ -హైదరాబాద్ నేడు తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేశారు. సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణపేట, నల్లగొండ, యాదాద్రి, జనగామ, కామారెడ్డి జిల్లాల్లో వానలు పడొచ్చని పేర్కొన్నారు. ఈ రాత్రికి హైదరాబాద్ లో అక్కడక్కడ వర్షాలు పడే ఛాన్స్ ఉందని వెల్లడించారు. అటు ఆంధ్రప్రదేశ్ లోనూ పలు జిల్లాల్లో వర్షాలు పడతాయని APSD-MA అంచనా వేసింది.



మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

## తహసీల్దార్ కార్యాలయంపై ఏసీబీ దాడి...

### లంచం తీసుకుంటూ దొరికిపోయిన ఎమ్ఆర్ఓ శాంతిస్వరూప్

**మన దునియా,నెల్లూరు జిల్లా:జూన్ 20**



పట్టాదారు పాసుపుస్తకంలో మార్పులు చేసేందుకు ఓ రైతు నుంచి లంచం డిమాండ్ చేసిన అవినీతి అధికారిని అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నెల్లూరు జిల్లా ఎ.ఎస్.పేట (అనుమసముద్రంపేట) తహసీల్దార్ డి. శాంతిస్వరూప్ శనివారం రూ.20,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ వలలో చిక్కారు.


**ఏసీబీ అధికారుల కథనం ప్రకారం..**

జిల్లాకు చెందిన కృష్ణారెడ్డి అనే రైతు తన పట్టాదారు పాసుపుస్తకంలో పేరు మార్చడం (మ్యుటేషన్) కోసం ఎ.ఎస్.పేట తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయితే, ఈ పని చేయడానికి తహసీల్దార్ శాంతిస్వరూప్ రైతు నుంచి ఇరవై వేల రూపాయల లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధిత రైతు కృష్ణారెడ్డి ఈ విషయమై నెల్లూరు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. పక్కా పథకం ప్రకారం పట్టుకున్న అధికారులు రైతు ఇచ్చిన ఫిర్యాదుతో ఏసీబీ డీఎస్పీ నేతృత్వంలోని బృందం రంగంలోకి దిగింది. శనివారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయంలో రైతు కృష్ణారెడ్డి నుంచి తహసీల్దార్ శాంతిస్వరూప్ రూ.20 వేల నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఒక్కసారిగా దాడి చేశారు. రసాయన పరీక్షలు నిర్వహించి ఆయన చేతుల నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తహసీల్దార్‌ను అదుపులోకి తీసుకుని కార్యాలయంలోని రికార్డులను పరిశీలిస్తున్నారు. అవినీతికి పాల్పడే ఏ అధికారిని వదిలిపెట్టేది లేదని, లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీకి ఫిర్యాదు చేయాలని అధికారులు ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## తృటీలో తప్పిన ప్రాణాపాయం

## భారీగాలులలకు ఇంటిపై విరిగిపడ్డ చెట్టు

**మన దునియా, వాజేడు, జూన్ 20**





ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఉప్పెడు వీరాపురం గ్రామపంచాయతీ వెంగళరావుపేట గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి వీచిన బలమైన గాలులకు భారీ చెట్టు విరిగి ఇంటిపై పడడంతో పెను ప్రమాదం తృటిలో తప్పింది అదే గ్రామానికి చెందిన వేల్పుల మల్లేష్ నివాసం పక్కన ఉన్న చెట్టు ఒక్కసారిగా విరిగి ఇంటి పైకప్పు పై కూలడంతో చెట్టు బరువును ఇంటి పైకప్పు గోడల పెచ్చులు పెంకులు ఊడిపోవడంతో ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు భయాందోళనకు గురియై వేంటనే బయటకు పరుగులు తీశారు సకాలంలో బయటకు రావడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊరట ఇచ్చింది చేట్టు కూలిన ఘటనల్లో ఇంటి పై కప్పు దెబ్బతిని ఆస్తి నష్టం సంభ వించడంతో. బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు రాత్రివేళ జరిగిన ఈ ఘటనతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు సమాచారం అందుకున్న స్థానికులు ఘటన స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఇంటికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి బాధిత కుటుంబా నికి తక్షణపరిహారం అందించటంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు వర్షాకాల సమయంలో గ్రామాల్లో భారీగా ఉన్న చెట్లను ప్రమాదకరంగా ఉన్న చెట్లను చూసుకోవాలని జాగ్రత్తగా ఉండాలని అన్నారు

## బీపీతో ఇబ్బందిపడుతున్నారా?

రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అరటిపండు.. ప్రతి సీజన్‌లో ప్రతిచోటా సులభంగా లభించే పండు. ఇది ఒక సూపర్ ఫుడ్. వైద్యుల నుండి డైటీషియన్ల వరకు అందరూ రోజూ తినాలని సిఫార్సు చేస్తారు. ముఖ్యంగా బిపి రోగులకు ఇది ఒక దివ్యౌషధం లాంటిది. బీపీ రోగులు రోజూ ఒక అరటిపండు తినాలని వైద్యులు సలహా ఇస్తారు. వైద్యులు ఇచ్చిన ఈ చిన్న సలహా అధిక రక్తపోటు రోగుల జీవితాన్ని మార్చగలదు. అయితే బీపీ ఉన్నవారికి అరటిపండు ఎందుకు అంత ప్రత్యేకమైనదో? అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది సోడియంను సమతుల్యం చేస్తుంది. రక్తపోటును సహజంగా నియంత్రిస్తుంది. అధిక బీపీకి పొటాషియం సహజ శత్రువు అని వైద్యులు అంటున్నారు. ఒక మధ్య తరహా అరటిపండులో దాదాపు 422ఎస్త్ర పొటాషియం ఉంటుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ-రీనల్ ఫిజియాలజీలో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనంలో అధిక పొటాషియం తీసుకోవడం అనుకరణ కాలియురేసిస్, నాట్రియురేసిస్, బీపీని గణనీయంగా తగ్గిస్తుందని కనుగొంది. ఎక్కువ సోడియంతో కూడా ప్రయోజనాలను పొందవచ్చు. రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అది కూడా ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా. అందుకే దీనిని సూపర్ ఫుడ్ అని పిలుస్తారు. బీపీ రోగులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. అరటిపండును ఒక పరిపూర్ణ ఆరోగ్య చిరుతిండిగా పరిగణిస్తారు. అరటిపండు రుచికరమైనది మాత్రమే కాదు తక్కువ కేలరీలు, అధిక పోషకాలు కలిగిన పండు కూడా. మీరు దీన్ని ఉదయం ఎప్పుడైనా తినవచ్చు. స్నాక్స్ సమయంలో లేదా నడక తర్వాత. దీనివల్ల శరీరానికి మంచి శక్తి, పోషకాలు లభిస్తాయి. అరటిపండ్లలో ఉండే విటమిన్ బి6, మెగ్నీషియం రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. ప్రతిరోజూ ఒక అరటిపండు తినడం వల్ల మనసు కూడా రిలాక్స్‌గా ఉంటుంది. దీనివల్ల అనేక సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అరటిపండులో ఉండే డైటరీ ఫైబర్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా కొలెస్ట్రాల్‌ను సమతుల్యం చేస్తుంది. ఇది మీ గుండె ఆరోగ్యానికి బూస్టర్‌గా కూడా పనిచేస్తుంది.


## సెలబ్రిటీల మెరుపు మీ సొంతం..

## గ్లోయింగ్ స్కిన్ కోసం కొన్ని చిట్కాలు

సెలబ్రిటీలలా మెరిసిపోయే చర్మ సౌందర్యం పొందాలని చాలామంది మహిళలు కోరుకుంటారు. అయితే అది కేవలం కొందరికే సాధ్యమని అనుకుంటే పొరపాటే. సరైన జాగ్రత్తలు, కాస్త సమయం కేటాయిస్తే ఎవరైనా సరే సహజమైన, ఆరోగ్యకరమైన గ్లోయింగ్ స్కిన్ పొందవచ్చని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. డెర్మటాలజిస్టులు, మేకప్ ఆర్టిస్టులు మెరిసే చర్మం కోసం పాటించాల్సిన కొన్ని ముఖ్యమైన చిట్కాలను పంచుకున్నారు. ఆరోగ్యకరమైన చర్మం కోసం ఒక్కటే మంత్రం అంటూ ఏదీ లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మంచి ఆహారం, తగినంత నిద్ర, ఒత్తిడిని తగ్గించుకోవడం, సరైన స్కిన్‌కేర్ రొటీన్ పాటించడం వంటివి చాలా అవసరం. ముఖ్యంగా కొన్ని అలవాట్లను దినచర్యలో భాగం చేసుకోవడం ద్వారా చర్మంలో స్పష్టమైన మార్పు చూడవచ్చని వారు వివరిస్తున్నారు.

**నిపుణులు సూచిస్తున్న కొన్ని ముఖ్యమైన చిట్కాలు:**

ఎస్పీఎఫ్ తప్పనిసరి: చర్మానికి 90% నష్టం సూర్యరశ్మి వల్లే కలుగుతుంది. అందుకే వాతావరణంతో సంబంధం లేకుండా ప్రతిరోజూ బ్రాడ్ స్పెక్ట్రమ్ ఎస్పీఎఫ్ (శ్రాఖీ) 50 ఉన్న సన్‌స్క్రీన్ వాడటం తప్పనిసరి. ఇంట్లో ఉన్నప్పుడు కూడా కిటికీల నుంచి వచ్చే యూవీఏ కిరణాల నుంచి ఇది రక్షణ కల్పిస్తుంది. అసలు ఎస్పీఎఫ్ (శ్రాఖీ) అంటే సన్ ప్రొటెక్షన్ ఫ్యాక్టర్. ఇది సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన యూవీబీ కిరణాల నుంచి మన చర్మానికి ఎంత రక్షణ లభిస్తుందో సూచిస్తుంది. ఉదాహరణకు, ఎస్పీఎఫ్ 50 రాసుకుంటే, సాధారణం కంటే 50 రెట్లు ఎక్కువ సమయం చర్మం సురక్షితంగా ఉంటుందని అర్థం. తేమ (మాయిశ్చర్) కీలకం: చర్మం పొడిబారినట్లు అనిపిస్తే, హైల్యూరోనిక్ యాసిడ్ ఉన్న సీరమ్ లేదా మాయిశ్చరైజర్ వాడాలి. ఇది నీటిని ఆకర్షించి చర్మాన్ని లోపలి నుంచి తేమగా, కాంతివంతంగా మారుస్తుంది. ఆహారం, వ్యాయామం: ఆహారంలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే కూరగాయలు, పండ్లు చేర్చుకోవాలి. అలాగే, రోజూ చేసే వ్యాయామం రక్త ప్రసరణను మెరుగుపరిచి చర్మానికి సహజమైన నిగారింపును ఇస్తుంది. మద్యపానానికి దూరంగా ఉండటం వల్ల చర్మం డీహైడ్రేట్ కాకుండా ఉంటుంది. యాక్టివ్ ఇంగ్రీడియంట్స్: చర్మం నిస్తేజంగా, డల్‌గా కనిపిస్తే రెటినాల్ (విటమిన్ ఎ) వాడకం మేలు చేస్తుంది. ఇది కొత్త కణాల ఉత్పత్తిని ప్రోత్సహించి చర్మాన్ని తాజాగా మారుస్తుంది. అయితే, దీనిని నిపుణుల సలహా మేరకు తక్కువ మోతాదుతో ప్రారంభించాలి. ఈ చిట్కాలతో పాటు తగినంత నిద్ర, ఒత్తిడిని జయించడం వంటివి పాటిస్తే చర్మం సహజంగానే ఆరోగ్యంగా, కాంతివంతంగా మారుతుందని నిపుణులు భరోసా ఇస్తున్నారు.




## ఉల్లి ఆకులలోని ఆరోగ్య రహస్యం..!

ఉల్లి ఆకులను క్రమంగా తీసుకోవటం వల్ల చర్మాన్ని బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ నుండి కాపాడుతాయి. జిడ్డు సమస్య కూడా తగ్గుతుంది. సెబమ్ స్థాయిలను సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. అధిక యూరిక్ యాసిడ్ ఇటీవలి కాలంలో ఒక సాధారణ పరిస్థితి. కొన్నిసార్లు అది పెరిగితే ఇంటి నివారణలు లేదా చికిత్స అవసరం కావచ్చు. ఆకు కూరలు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. ఈ విషయం మనందరికీ తెలిసిందే. అలాంటి ఆకు కూరల్లో ఉల్లి ఆకు కూడా ఒకటి. అవును ఉల్లిపాయలే కాదు ఉల్లి ఆకులను కూడా ఆహారంగా తీసుకోవచ్చు. వీటితో అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందుతారని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ఉల్లి ఆకుల్లో ఫినోలిక్ ఆమ్లాలు, ఫ్లేవనాయిడ్లు, సల్ఫర్ వంటి సమ్మేళనాలు కనిపిస్తాయి. ఇవి మీ చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి కాపాడతాయని స్పష్టం చేశారు. ఉల్లి ఆకుల్లో విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. వీటిలోని పోషకాలు మరింత యవ్వనంగా కనిపించడానికి దోహదం చేస్తాయి. ఉల్లి ఆకులకు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. వీటిలోని సల్ఫర్ సమ్మేళనాలు చర్మానికి ఉపశమనం కలిగించటం లేదా చికాకును తగ్గించడంలో సహాయపడుతాయి. ఉల్లి ఆకులను క్రమంగా తీసుకుంటే మొటిమలు, తామర, సోరియాసిస్‌తో వంటి సమస్యలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుంది. ఉల్లిపాయలు చర్మంలో తేమను పెంచడంలో సహాయపడతాయి. పొడిబారడాన్ని తగ్గించడానికి తోడ్పడుతాయి. ఉల్లి ఆకులను క్రమంగా తీసుకోవటం వల్ల చర్మాన్ని బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ నుండి కాపాడుతాయి. జిడ్డు సమస్య కూడా తగ్గుతుంది. సెబమ్ స్థాయిలను సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. అధిక యూరిక్ యాసిడ్ ఇటీవలి కాలంలో ఒక సాధారణ పరిస్థితి. కొన్నిసార్లు అది పెరిగితే ఇంటి నివారణలు లేదా చికిత్స అవసరం కావచ్చు.



## మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే



శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు. పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది. పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి. గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ పండు శరీరానికి అవసరమైన ఎనర్జీ అందించే ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఇది శరీరంలోని వ్యర్థ పదార్థాలను వెలుపలికి పంపడంలో సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించడానికి అవకాడో ఉపయోగపడుతుంది. ఆస్పరాగస్‌లో ఫైబర్, ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది. గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.

# సెంచరీతో జైస్వాల్, అర్ధసెంచరీతో హిట్ మ్యాన్... ఇద్దరూ టచ్ లోకి వచ్చారు... ఆఫ్ఘన్ పై టీమిండియా క్లీన్ స్వీప్

**మూడో వన్డేలోనూ టీమిండియా జయభేరి**

**ఆఫ్ఘనిస్థాన్‌తో వన్డే సిరీస్ 3-0తో క్లీన్‌స్వీప్**

**చెన్నై వన్డేలో సంచలన బౌలింగ్‌తో ఐదు వికెట్లు పడగొట్టిన ప్రసిద్ధ్ కృష్ణ**

**భారత్ ఛేదనలో 110 పరుగులతో అజేయ శతకం సాధించిన యశస్వి జైస్వాల్**

**ధాటిగా ఆడి 79 పరుగులు చేసిన రోహిత్ శర్మ, తొలి వికెట్‌కు 170 పరుగుల భాగస్వామ్యం**

**వృథా అయిన ఆఫ్ఘన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిది సెంచరీ**



చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరిగిన మూడో వన్డేలో భారత జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఆఫ్ఘనిస్థాన్‌ను 9 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించి, మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. బౌలింగ్‌లో ప్రసిద్ధ్ కృష్ణ... బ్యాటింగ్‌లో యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ చెలరేగడంతో భారత్ ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. వన్డే కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌కు ఇదే తొలి సిరీస్ విజయం కావడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆఫ్ఘనిస్థాన్ నిర్ణయం బెడిసికొట్టింది. ఆరంభం నుంచే భారత పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ నిప్పులు చెరిగే బంతులతో విరుచుకుపడ్డాడు. తన కెరీర్‌లో తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శన (8.2 ఓవర్లలో 23 పరుగులిచ్చి 5 వికెట్లు) చేసి ఆఫ్ఘన్ పతనాన్ని శాసించాడు. గుర్బాజ్ (5), ఇబ్రహీం జద్రాన్ (11), రహ్మత్ షా (5) వంటి కీలక బ్యాటర్లను స్వల్ప స్కోర్లకే పెవిలియన్‌కు పంపి కోలుకోలేని దెబ్బ తీశాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, మరో ఎండ్‌లో ఆఫ్ఘన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిది సెంచరీతో ఒంటరి పోరాటం చేశాడు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి 131 బంతుల్లో 102 పరుగులు చేశాడు. అతనికి అజ్మతుల్లా ఒమర్జాయ్ (50) నుంచి కొంత సహకారం లభించడంతో ఆఫ్ఘనిస్థాన్ గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. చివరకు 44.2 ఓవర్లలో 218 పరుగులకు ఆ జట్టు ఆలౌట్ అయింది. అనంతరం 219 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. వీరిద్దరూ ఆఫ్ఘన్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. ముఖ్యంగా జైస్వాల్ దూకుడుగా ఆడగా, రోహిత్ తనదైన శైలిలో బౌండరీలు, సిక్సర్లతో అలరించాడు. ఈ ఇద్దరూ తొలి వికెట్‌కు 170 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి భారత్ విజయాన్ని ఖాయం చేశారు. రోహిత్ శర్మ 69 బంతుల్లో 79 పరుగులు చేసి ఔటయ్యాడు. రోహిత్ ఔటైన తర్వాత తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించిన జైస్వాల్, శ్రేయస్ అయ్యర్ (20లి) తో కలిసి మిగతా పని పూర్తిచేశాడు. ఈ క్రమంలో 86 బంతుల్లో 110 పరుగులతో అజేయ శతకం సాధించాడు. చివరిలో సిక్స్ కొట్టి జట్టుకు విజయాన్ని అందించడం విశేషం. ఈ అద్భుత ఇన్నింగ్స్‌తో భారత్ కేవలం 28.4 ఓవర్లలోనే ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ సిరీస్‌లో ఆద్యంతం భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించి అభిమానులను అలరించింది.

# ప్రసిద్ధ్ కృష్ణకు 5 వికెట్లు.. ఆఫ్ఘన్ కెప్టెన్ అద్భుత సెంచరీ.. టీమిండియా ముందు ఈజీ టార్గెట్

**భారత్‌తో మూడో వన్డేలో 218 పరుగులకు ఆలౌటైన ఆఫ్ఘనిస్థాన్**

**కెప్టెన్ హష్మతుల్లా షాహిది సెంచరీతో (102) ఒంటరి పోరాటం**

**5 వికెట్లు పడగొట్టి ఆఫ్ఘన్ పతనాన్ని శాసించిన ప్రసిద్ధ్ కృష్ణ**

**అజ్మతుల్లా ఒమర్జాయ్ (50) అర్ధ సెంచరీ**

చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరుగుతున్న మూడో వన్డేలో ఆఫ్ఘనిస్థాన్ జట్టు భారత్ ముందు 219 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. భారత బౌలర్ల ధాటికి ఒక దశలో విలవిల్లాడిన ఆఫ్ఘన్ ఇన్నింగ్స్‌ను కెప్టెన్ హష్మతుల్లా షాహిది (102) అద్భుత సెంచరీతో ఆదుకున్నాడు. భారత బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 5 వికెట్లతో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆఫ్ఘనిస్థాన్‌కు ఆరంభంలోనే భారీ షాక్ తగిలింది. పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ తన నిప్పులు చెరిగే బంతులతో ఆఫ్ఘన్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. కేవలం 36 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి ఆఫ్ఘనిస్థాన్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ షాహిది, అజ్మతుల్లా ఒమర్జాయ్ (50) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 105 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. ఒమర్జాయ్ అర్ధ సెంచరీ తర్వాత ఔటవ్వగా, షాహిది ఒంటరి పోరాటం కొనసాగించాడు. సహచరులు ఒక్కరొక్కరుగా పెవిలియన్‌కు క్యూ కడుతున్నా, కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి 131 బంతుల్లో 102 పరుగులు సాధించాడు. ఇన్నింగ్స్ చివరి వికెట్‌గా షాహిది ఔటవ్వడంతో ఆఫ్ఘనిస్థాన్ 44.2 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ కేవలం 23 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టగా, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్, హర్ష్ దూబే తలో వికెట్ దక్కించుకున్నారు. ఈ సిరీస్ లో ఇప్పటికే తొలి రెండు మ్యాచ్ లు నెగ్గిన భారత్... 2-0తో సిరీస్ ను చేజిక్కించుకుంది. నేటి చివరి మ్యాచ్ లోనూ నెగ్గి సిరీస్ ను క్లీన్ స్వీప్ చేయాలని టీమిండియా కృతనిశ్చయంతో ఉంది. కెప్టెన్ శుభ్ మన్ గిల్, ఇషాన్ కిషన్ భీకర ఫామ్ లో ఉండడంతో 219 పరుగుల లక్ష్యం ఏమంత కష్టసాధ్యం కాదని అర్థమవుతోంది.




# మహిళల టీ20 ప్రపంచకప్‌లో సంచలనం.. పాక్‌ను చిత్తు చేసిన బంగ్లా



**23 పరుగుల తేడాతో పాక్‌ను ఓడించిన బంగ్లా మహిళల జట్టు**

**టోర్నీలో పాకిస్థాన్‌కు ఇది వరుసగా మూడో ఓటమి**

**బంగ్లా స్పిన్నర్ల ధాటికి కుప్పకూలిన పాకిస్థాన్ బ్యాటింగ్ లైనప్**

మహిళల టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ సంచలన విజయం నమోదు చేసింది. శనివారం జరిగిన గ్రూప్-1 మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై 23 పరుగుల తేడాతో గెలిచి సత్తా చాటింది. ఈ టోర్నీలో పాకిస్థాన్‌కు ఇది వరుసగా మూడో ఓటమి కాగా, ఆ జట్టు సెమీ ఫైనల్ ఆశలు దాదాపుగా ఆవిరయ్యాయి. సౌతాంప్టన్‌లోని రోజ్ బౌల్ మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. కెప్టెన్ నిగర్ సుల్తానా (36), శోభన మోస్త్రరీ (22) రాణించగా, ఆఖరి ఓవర్లలో షోర్నా అక్తర్ మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. ఆమె కేవలం 22 బంతుల్లోనే 5 ఫోర్లతో అజేయంగా 39 పరుగులు చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించింది. పాకిస్థాన్ బౌలర్లలో ఫాతిమా సనా రెండు వికెట్లు పడగొట్టింది. 124 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్, ఒక దశలో 64 పరుగులకు 2 వికెట్లే కోల్పోయి పటిష్ఠ స్థితిలో కనిపించింది. ఓపెనర్లు మునీబా అలీ (25), గుల్ ఫిరోజా (23) జట్టుకు మంచి ఆరంభాన్ని ఇచ్చారు. అయితే, ఆ తర్వాత బంగ్లాదేశ్ స్పిన్నర్లు విజృంభించడంతో పాక్ బ్యాటింగ్ లైనప్ కుప్పకూలింది. నహిదా అక్తర్ (3 వికెట్లు), సంజిదా అక్తర్ మేఘల (3 వికెట్లు) తమ స్పిన్ ధాటికి పాక్ మిడిలార్డర్‌ను కకావికలం చేశారు. దీంతో పాకిస్థాన్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 100 పరుగులకే పరిమితమైంది. ఈ విజయంతో బంగ్లాదేశ్ సెమీస్ ఆశలను సజీవంగా ఉంచుకోగా, ఆడిన మూడు మ్యాచ్‌లలోనూ ఓటమి పాలైన పాకిస్థాన్ పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానానికి పడిపోయింది.

# తొలి ఓవర్‌లోనే 23 పరుగులు.. 22 ఏళ్ళ రికార్డు బ్రేక్

**ఆఫ్ఘనిస్థాన్‌పై వన్డే సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన భారత్**

**2004లో బంగ్లాదేశ్‌పై 22 పరుగుల రికార్డు బద్దలు**

**యశస్వి జైపాల్ చెలరేగడంతో తొలి ఓవర్‌లోనే 23 పరుగులు**

ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. చెన్నైలోని చిదంబరం స్టేడియంలో శనివారం జరిగిన మూడో, చివరి వన్డేలో 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌తో భారత జట్టు వన్డే ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో అత్యధిక పరుగులు చేసి 22 ఏళ్ల నాటి రికార్డును బద్దలు కొట్టింది. 219 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు, ఆఫ్ఘనిస్థాన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిది సింగిల్ కోసం పిచ్‌పై డేంజర్ ఏరియాలో పరుగెత్తడంతో పెనాల్టీ రూపంలో ఐదు పరుగులు అదనంగా లభించాయి. దాంతో టీమిండియా 5/0తో ఇన్నింగ్స్ ఆరంభించింది. అజ్మతుల్లా ఒమర్జాయ్ వేసిన తొలి ఓవర్‌లో యశస్వి జైస్వాల్ చెలరేగి ఆడటంతో, పెనాల్టీ పరుగులతో కలిపి మొత్తం 23 పరుగులు వచ్చాయి. వైడ్లు, నో-బాల్స్‌తో కలిపి ఈ భారీ స్కోరు నమోదైంది. దీంతో 2004లో బంగ్లాదేశ్‌పై భారత్ నెలకొల్పిన 22 పరుగుల రికార్డు కనుమరుగైంది. ఈ దూకుడైన ఆరంభంతో టీమిండియా కేవలం 28.4 ఓవర్లలోనే ఒక వికెట్ నష్టానికి 224 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. ఓపెనర్లు రోహిత్ శర్మ (79), యశస్వి జైస్వాల్ (110 నాటౌట్) అద్భుతమైన పునాది వేయగా, శ్రేయస్ అయ్యర్ (20 నాటౌట్) కూడా తన వంతు సహకారం అందించాడు. అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆఫ్ఘనిస్థాన్‌ను భారత పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ కోలుకోలేని దెబ్బతీశాడు. కేవలం 23 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టడం ద్వారా కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. ఈ వేదికపై ఒక భారత పేసర్‌కు ఇది తొలి ఐదు వికెట్ల ప్రదర్శన కావడం విశేషం. ప్రసిద్ధ్ ధాటికి ఆఫ్ఘన్ జట్టు 36 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్రమంలో కెప్టెన్ హష్మతుల్లా షాహిది (102) తన తొలి వన్డే సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. ఒమర్జాయ్ (50)తో కలిసి 105 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. అయితే, చివరి వరుస బ్యాటర్లు మరోసారి తడబడటంతో ఆఫ్ఘనిస్థాన్ 44.2 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌట్ అయింది.



మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

## ఇదిగో మా క్లీంకార.. తొలిసారి కుమార్తెను చూపించిన రామ్ చరణ్, ఉపాసన...



**చిన్నారి బర్త్‌డే సందర్భంగా ఫొటో షేర్**

**ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన ఉపాసన**

**వైరల్‌గా మారిన కుటుంబ చిత్రం**

**అభిమానుల నుంచి శుభాకాంక్షల వెల్లువ**

**క్లీంకార చిరునవ్వు ఆకర్షణ**

మెగా అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న క్షణం ఎట్టకేలకు వచ్చింది. రామ్ చరణ్, ఉపాసన దంపతులు తమ కుమార్తె క్లీంకార ముఖాన్ని తొలిసారి ప్రపంచానికి చూపించారు. ఆమె పుట్టిన రోజు సందర్భంగా ఉపాసన తన సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఇప్పటివరకు కూతురు ముఖం కనిపించకుండా జాగ్రత్తపడిన ఈ జంట మూడో బర్త్‌డే రోజున అభిమానులకు ప్రత్యేక కానుక ఇచ్చింది."మా అమూల్యమైన చిన్నారి క్లీంకారకు పుట్టినరోజు శుభాకాంక్షలు" అంటూ ఉపాసన తన ఫేస్‌బుక్ ఖాతాలో అందమైన తమ ఫ్యామిలీ ఫొటోను పంచుకున్నారు. పచ్చని ప్రకృతి మధ్యలో రామ్ చరణ్, ఉపాసన తమ గారాల పట్టిని ప్రేమగా ఎత్తుకుని ఉన్న ఈ చిత్రం అభిమానులను ఆకట్టుకుంటోంది. నీలి రంగు దుస్తుల్లో చిరునవ్వులు చిందిస్తున్న చిన్నారి అందరి చూపును కట్టిపడేస్తోంది. బుగ్గల నిండా నవ్వు, కళ్లలో అమాయకత్వం, ముఖంలో మెరిసే ఆనందం ఫొటోకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తల్లిదండ్రుల ఒడిలో హాయిగా కూర్చుని నవ్వుతున్న మెగా వారసురాలు ఆ కుటుంబ చిత్రానికి మరింత అందాన్ని తీసుకొచ్చింది. కొందరు ఆమె కళ్లు తాత మెగాస్టార్ చిరంజీవి కళ్లలా ఉన్నాయని కామెంట్ చేస్తున్నారు.ఈ పోస్ట్ బయటకు వచ్చిన వెంటనే సోషల్ మీడియాలో శుభాకాంక్షల వెల్లువ మొదలైంది. మెగా అభిమానులతో పాటు సినీ ప్రముఖులు క్లీంకారకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. మూడేళ్లుగా అభిమానులు ఎదురుచూస్తున్న ఆమె ఫేస్ రివీల్ కావడంతో ఈ ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

## సమంత గర్భవతా..! సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వీడియో


**'మా ఇంటి బంగారం' సక్సెస్ వేడుకలో పాల్గొన్న సమంత**

**వైరల్ అయిన వీడియోతో ప్రెగ్నెన్సీపై ఊహాగానాలు**

**ఫిట్‌గా ఉన్న టీషర్ట్‌లో బేబీ బంప్ కనిపించిందంటూ నెటిజన్ల చర్చ**

ప్రముఖ కథానాయిక సమంత గర్భవతి అంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది. ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్ర విజయోత్సవ వేడుకలకు సంబంధించిన వీడియోలు వైరల్ కావడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ వీడియోలలో సమంతకు బేబీ బంప్ కనిపిస్తోందంటూ నెటిజన్ల మధ్య పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.జూన్ 19న ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'మా ఇంటి బంగారం' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ నిర్వహించిన విజయోత్సవ వేడుకల్లో సమంత తన భర్త, దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి పాల్గొన్నారు. వైట్ టీషర్ట్ ధరించిన సమంత, చిత్ర బృందంతో కలిసి కేక్ కట్ చేస్తున్న దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. అయితే, ఈ వీడియోలలో ఆమె గర్భవతిలా కనిపిస్తున్నారంటూ పలువురు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. దీంతో అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.గతేడాది సమంత, రాజ్ నిడిమోరుల వివాహం అత్యంత సన్నిహితుల సమక్షంలో నిరాడంబరంగా జరిగింది. కాగా, బీవీ నందిని రెడ్డి దర్శకత్వం వహించిన 'మా ఇంటి బంగారం' చిత్రం తొలిరోజే ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 13 కోట్లు వసూళ్లను రాబట్టి, సమంత కెరీర్‌కు మంచి కంబ్యాక్ ఇచ్చింది.






## 'మా ఇంటి బంగారం'కు మంచి ఓపెనింగ్స్.. మహిళా ప్రేక్షకులకు సమంత థ్యాంక్స్

**'మా ఇంటి బంగారం'కు తొలిరోజు భారీ వసూళ్లు**

**ప్రపంచవ్యాప్తంగా రూ. 13.15 కోట్లు గ్రాస్ సాధించిన సినిమా**

**సినిమా విజయంలో మహిళలదే కీలక పాత్రన్న సమంత**

**ఈ చిత్రంలోని స్వర్ణ పాత్ర నా నిజ జీవితానికి దగ్గరగా ఉంటుందని వెల్లడి**

సమంత ప్రధాన పాత్రలో నటించి, స్వయంగా నిర్మించిన చిత్రం 'మా ఇంటి బంగారం'. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన ఆరంభాన్ని అందుకుంది. విడుదలైన తొలిరోజే ప్రపంచవ్యాప్తంగా రూ. 13.15 కోట్ల గ్రాస్ వసూలు చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ భారీ విజయం పట్ల సమంత ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా సినిమా ఓపెనింగ్స్‌కు మహిళా ప్రేక్షకులు భారీగా తరలిరావడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు.ఈ విజయంపై ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఒక నోట్ రాశారు. "మొదటి రోజు ఒక సినిమాకు ఇంత మంచి ఓపెనింగ్ రావడం చాలా ఆనందంగా ఉంది. యువత నుంచి పెద్దల వరకు అందరూ సినిమాను ఆశీర్వదించడానికి రావడం గొప్ప అనుభూతినిచ్చింది" అని ఆమె పేర్కొన్నారు."థియేటర్లకు ఓపెనింగ్స్‌ను మగ ప్రేక్షకులే తెస్తారని చాలాకాలంగా వింటున్నాం. కానీ, ఈ సినిమాకు మహిళలు భారీగా తరలిరావడం చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. సినిమా ప్రేక్షకులు కూడా ఎదుగుతున్నారని అర్థమవుతోంది. మా చిన్న ప్రొడక్షన్ హౌస్ విజయం సాధించింది" అంటూ తన సంతోషాన్ని పంచుకున్నారు.ఇటీవలే ఓ ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. 'మా ఇంటి బంగారం'లోని స్వర్ణ పాత్ర తన నిజ జీవితానికి చాలా దగ్గరగా ఉంటుందని సమంత తెలిపారు. తాను ఇప్పటివరకు చేసిన తెలుగు పాత్రలన్నింటిలో ఇదే తనకు అత్యంత ఇష్టమైనదని చెప్పారు. చిత్రంలోని యాక్షన్ సన్నివేశాల గురించి మాట్లాడుతూ.. "సినిమాలో స్లో మోషన్ షాట్లు, బిల్డప్ షాట్లు ఉండవు. నిజమైన పంచ్‌లు ఉంటాయి. నాకు కూడా దెబ్బలు తగిలాయి, రక్తం వచ్చింది. అన్ని యాక్షన్ సీన్లను నేనే స్వయంగా చేశాను. అందుకే అవి అంత సహజంగా కనిపిస్తున్నాయి" అని సమంత వెల్లడించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com